సాక్షి రంగారెడ్డి

శుక్రవారం । 12 । మే । 2023



రాయితీ లేకపాయె..

కూరగాయల పంటల సాగుకు ప్రోత్సాహం కరువైంది. రాయితీలపై అందించే విత్తనాలు, యంత్ర సామగ్రి అందడం లేదు. 10లో▸



కనులపండువగా బ్రహ్మోత్సవాలు

తలకొండపల్లిలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు రెండో రోజు గురువారం వైభవంగా నిర్వహించారు. 10లో▸



లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్

నేరస్తులలో పరివర్తన కోసం రాచకొండ పోలీసులు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 10లో▸

న్యూస్‌రీల్

దివ్యాంగులకు 'జాబ్ కార్డ్స్' ఇవ్వాలి



సమావేశంలో పాల్గొన్న సంఘం నాయకులు

ఇబ్రహీంపట్నం: ఉపాధి హామీ పథకంలో దివ్యాంగులకు జాబ్ కార్డ్స్ ఇచ్చి పని కల్పించాలని ఎన్‌పీఆర్డీ రాష్ట్ర కార్యదర్శి ఎం.అడివయ్య డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగులకు పని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. స్థలం ఉన్న దివ్యాంగులకు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని, రాష్ట్రంలో ఉన్న 12.2 శాతం ఉన్న దివ్యాంగులకు సంక్షేమ పథకాల్లో 12 శాతం కేటాయించాలని డిమాండ్ చేశారు. దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రాజు, జంగయ్య, నిర్మల, పాండురంగా రెడ్డి, మహేశ్‌గౌడ్, జంగయ్య, వీరేశం, యాదయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భూ తగాదాలో కత్తులతో దాడి

- ఒకరికి గాయాలు

మొయినాబాద్: భూ తగాదాలో ఓ వర్గంవారు కత్తులతో దాడి చేయడంతో ఒకరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని తోలుకట్టలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తోలుకట్ట గ్రామానికి చెందిన యూసుఫ్ ఖాన్ సర్వేనంబర్ 144లో కొన్నేళ్ల క్రితం 20 ఎకరాల భూమి కొనుగోలు చేశాడు. అతనికి నలుగురు కొడుకులు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. కొంత కాలంగా అందరూ నగరంలో ఉంటున్నారు. చిన్న కూతురు షహనాజ్ బేగం కొంత కాలంగా భూమిని సాగుచేస్తూ వచ్చింది. 2016లో 20 ఎకరాల్లో నుంచి 6 ఎకరాల భూమిని రెవెన్యూ రికార్డుల్లో తన పేరు నమోదు చేయించుకుంది. విషయం తెలిసి మిగతావారు కోర్టులో కేసు వేశారు. కేసు నడుస్తుండగానే షహనాజ్‌బేగం ఆ భూమిని ఇతరులకు విక్రయించింది. రెండు మూడు చేతులు మారి ప్రస్తుతం వెంకట సుబ్బయ్య అనే వ్యక్తి కొనుగోలు చేశాడు. మంగళవారం రాత్రి వెంకటసుబ్బయ్య తను కొనుగోలు చేసిన భూమిలో వాల్ ఏర్పాటు చేయడానికి కొంత మందిని తీసుకు రావడంతో షహనాజ్‌బేగం అన్న హరూన్ రషీద్‌ఖాన్ మరికొంత మందితో వచ్చి దాడి చేశారు. అక్కడున్న ద్విచక్రవాహనాలను ధ్వంసం చేశారు. కత్తులతో దాడి చేయడంతో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలం వద్దకు వెళ్లేసరికి దాడిచేసినవారంతా పారిపోయారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హరూన్ రషీద్‌ఖాన్‌తోపాటు మరో ఎనిమిది మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విమాన ప్రయాణికులకు ఫేక్ టికెట్లు

హిమాయత్‌నగర్: దేశంలోని పలు ప్రాంతాలకు అత్యవసరంగా వెళ్లాలనుకునే వారిని టార్గెట్ చేశాడో సైబర్ నేరగాడు. నగరంలోని ఓ ట్రావెల్ కంపెనీ వివరాలను హ్యాక్ చేసి వాటి ఆధారంగా విమాన టికెట్లను బుక్ చేశాడు. ఫేక్ టికెట్లు అని తేలడంతో సదరు ట్రావెల్ కంపెనీని నిలదీశారు ప్రయాణికులు. ఈ ఉదంతం ట్రావెల్ కంపెనీ నిర్వాహకులకి తెలియక పోవడంతో వారు గురువారం సిటీ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నగరంలోని 'తోఫిక్ టెక్ అండ్ ట్రావెల్' కంపెనీ పాస్‌వర్డ్, యూజర్ ఐడీలను గుర్తు తెలియని వ్యక్తి హ్యాక్ చేశాడు. ఈ కంపెనీ పేరుపై 30 మంది కస్టమర్లను మోసం చేసి వారి నుంచి రూ.10 లక్షలు దోచుకున్నాడు. దేశంలోని ప్రధాన నగరాలకు అత్యవసరంగా వెళ్లాలనుకునే వారికి తమ కంపెనీ వెబ్‌సైట్ ద్వారా బుకింగ్ చేసుకుంటే డిస్కౌంట్ వస్తుందంటూ అడ్వర్టైజ్‌మెంట్స్ పోస్ట్ చేశాడు. అత్యవసరంగా వెళ్లాలనుకునేవారికి టికెట్లను బుక్ చేసి వాటి వివరాలను పీడీఎఫ్ ద్వారా వాట్సప్‌కు పంపారు. తీరా శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వెళ్లిన 30 మంది ప్రయాణికులకు అవి ఫేక్ టికెట్లుగా తేలింది. దీంతో సదరు కంపెనీ నిర్వాహకుల్ని నిలదీయగా.. టికెట్లను తాము బుక్ చేయలేదని చెప్పడంతో సైబర్‌క్రైం ఠాణాలో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ ప్రసాద్ చెప్పారు.

జగన్‌మోహన్ రావుకు కీలక బాధ్యతలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న సీఎం కప్ క్రీడోత్సవాల్లో భారత హ్యాండ్‌బాల్ సంఘం అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావుకు కీలక బాధ్యతలు అప్పగించారు. పోటీల నిర్వహణపై క్రీడల మంత్రి శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఉన్నతస్థాయి సమీక్షలో జగన్‌మోహన్ రావును సీఎం కప్ ప్రారంభోత్సవ కమిటీ చైర్మన్‌గా నియమించారు.

అచ్చం అలానే..!



రాజేంద్రనగర్‌లో ఇటీవల పట్టుబడిన నకిలీ అల్లంవెల్లుల్లి పేస్ట్

పిల్లలు తాగే పాలు, తినే ఐస్‌క్రీమ్‌లూ కల్తీ

- అల్లం పేస్టులో ఆలుగడ్డ మిక్సింగ్
- ఎస్ఓటీ పోలీసుల దాడుల్లో వెలుగులోకి..
- కల్తీ ఆహారంతో ఆరోగ్య సమస్యలు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: 'కాదేదీ కల్తీకి అనర్హం' అన్నట్లు చిన్నారులు ఇష్టంగా తినే చాక్లెట్లు, ఐస్‌క్రీమ్‌లు మొదలు.. బియ్యం, పప్పులు, టీ పొడర్, అయిల్, అల్లం పేస్ట్ ఇలా అన్నీ కల్తీమయం అవుతున్నాయి. అక్రమార్జనే ధ్యేయంగా కొంత మంది వ్యాపారులు అసలుకు ఏమాత్రం తీసిపోని విధంగా నాసిరకం ఆహార పదార్థాలను తయారు చేసి, వాటికి బ్రాండెడ్ లేబుళ్లను అతికించి గుట్టుగా మార్కెట్‌లోకి తరలిస్తున్నారు. ఏది అసలో.. ఏది కల్తీదో గుర్తించలేని పరిస్థితి. ఇలాంటి నకిలీ తయారీ సంస్థలపై దాడులు చేయాల్సిన ఫుడ్ సేఫ్టీ అధికారులు నామమాత్రపు తనిఖీలతో చేతులు దులుపుకొంటున్నారు. కల్తీ ఆహారం తిన్న వారు వాంతులు, విరేచనాలతో పాటు తీవ్రమైన గ్యాస్ట్రిక్ సమస్యల బారిన పడుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

కృత్రిమ పాలు

సాధారణంగా వేసవిలో పాల దిగుబడి తక్కువ. ప్రస్తుతం మార్కెట్లో పాలు, పెరుగుకు డిమాండ్ ఎక్కువ. ప్యాకెట్ పాలతో పోలిస్తే.. డబ్బావాలాలు సరఫరా చేసే గేదె పాలలో వెన్న శాతం ఎక్కువగా ఉంటుందని జనం భావిస్తుంటారు. వారిలో ఉన్న ఈ బలహీనతను పలువురు వ్యాపారులు 'క్యాష్' చేసుకుంటున్నారు. పాల పొడర్, యూరియా, ఆయిల్, మంజీర నీళ్ల కలిపి కృత్రిమ పాలను తయారు చేస్తున్నారు. వాటిని నాణ్యమైన పాలుగా పేర్కొంటూ విక్రయిస్తున్నారు. చేవెళ్ల, నందిగామ, ఆల్మాస్‌గూడ, నాదర్‌గుల్, ముచ్చింతల్, పసుమాముల ప్రాంతాల్లోని పలు డెయిరీల్లో ఇటీవల జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించగా నిర్దేశించిన ప్రమాణాలు లేవని గుర్తించారు. పసిపిల్లలు తాగే పాలను సైతం కల్తీ చేస్తుండడం కలవరానికి గురిచేస్తోంది.

సన్న బియ్యంగా మార్చి..

సాధారణ సన్న బియ్యంలో మిల్లింగ్ చేయించిన రేషన్ బియ్యాన్ని కలుపుతూ మోసాలకు పాల్పడుతున్నారు. ప్రముఖ బ్రాండెడ్ లేబుళ్లతో కూడిన బస్తాల్లో ఈ బియ్యాన్ని నింపి గుట్టుగా మార్కెట్లో విక్రయిస్తున్నారు. కొనుగోలు సమయంలో చూపే శాంపిల్స్‌కి.. తీరా ఇంటికి తీసుకెళ్లి వండే బియ్యానికి తేడా ఉంటోంది. వండిన తర్వాత అన్నం ముద్దగా మారుతోంది. టీ పొడర్‌లోనూ రంపపు పొట్టును కలుపుతున్నారు.

తనిఖీల్లో తేటతెల్లం

కాటేదాన్ పారిశ్రామికవాడలోని 24 కంపెనీల్లో 20 రోజుల క్రితం ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. 17 కంపెనీలకు సంబంధించిన ఉత్పత్తులు కల్తీ, నాసిరకంతో ఉన్నట్లు గుర్తించారు. ఆయా కంపెనీలకు నోటీసులు జారీ చేశారు. వీటిలో ప్రధానంగా రవి ఫుడ్స్ బిస్కెట్స్ కంపెనీ పరిమితికి మించి సింథటిక్ కలర్లు వాడుతున్నట్లు తేలింది. అల్లం వెల్లుల్లి పేస్ట్‌లో ఆలుగడ్డను మిక్స్ చేసినట్లు గుర్తించారు. తుర్కయంజాల్, నాదర్‌గుల్, ఆల్మాస్‌గూడలోని పలువురు వ్యాపారులు సైతం అల్లం పేస్టులో ఆలుగడ్డ పేస్టును మిక్స్ చేసినట్లు గుర్తించారు.

కలుషిత నీటితో ఐస్‌క్రీంలు

- పర్వతాపూర్‌కు చెందిన అజీమ్ షాద్‌నగర్ మండలం రామచంద్రాపురంలో ఐస్‌క్రీం షాపు నడుపుతున్నాడు. కలుషిత నీటితో తయారు చేసిన ఐస్‌క్రీంతో పాటు నాసిరకం చాకోబార్‌లను విక్రయిస్తుండడంతో స్థానికులు ఇటీవల పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో కొందుర్గు పోలీసులు మంగళవారం రాత్రి ఐస్‌క్రీం షాపుపై దాడి చేసి రూ. 3లక్షల విలువ చేసే బ్రాండెడ్ లేబుళ్లతో పోలిన నాసిరకం వెనిల్లా కప్స్ -300, మ్యాంగో ఫ్లేవర్ -500, స్ట్రాబెర్రి -100, చాకోబార్ -100లను సీజ్ చేశారు.
- ఎర్రబిక్యా తండాకు చెందిన గాంగ్రియ, గోపి కొంతకాలంగా ఆమనగల్లు ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో మెగా కంపెనీ పేరిట ఐస్‌క్రీం తయారీ కేంద్రాన్ని నడుపుతున్నారు. బుధవారం శంషాబాద్ జోన్ ఎస్ఓటీ పోలీసులు ఈ కంపెనీపై దాడి చేశారు. కలుషిత నీటితో తయారు చేసిన ఐస్‌క్రీంలకు ఆకర్షణీయమైన బ్రాండెడ్ లేబుళ్లు వేస్తున్నట్లు గుర్తించి సీజ్ చేశారు. రూ.10 లక్షల విలువ చేసే ముడి పదార్థాలు, వాహనాలు స్వాధీనం చేసుకున్నారు.



ఆమనగల్లు పరిధిలో ఐస్‌క్రీంల తయారీ ఇలా..

దాడులు చేస్తున్నాం



మూడు నెలల్లో 45 నమూనాలు సేకరించాం. వీటిలో 33 ఉత్పత్తులు నాసిరకంగా ఉన్నట్లు గుర్తించాం. ఆయా దుకాణాలపై కేసులు నమోదు చేయించాం. లూజ్ జింజెర్‌లో సిట్రిక్ యాసిడ్ అధికంగా కలుపుతున్నట్లు గుర్తించాం. రాజేంద్రనగర్, సాతంరాయిలోని పలు బిస్కెట్, చాక్లెట్ల కంపెనీల్లో తనిఖీలు చేసి కల్తీ ఉన్నట్లు గుర్తించాం. శ్రీచక్ర, గాయత్రి, శ్రీ సాయి, శ్రీ గీత, వీకే డెయిరీ, ఆల్‌రిచ్ డెయిరీల నుంచి నమూనాలు సేకరించి పరీక్షించాం. పాలు, పాల ఉత్పత్తుల్లో నిర్దేశించిన ప్రమాణాలు లేవు. ఆయా యాజమాన్యాలపై కేసులు నమోదు చేశాం.

– ఉదయ్ కిరణ్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్

ఆరోగ్యంపై ప్రభావం



కంటికి కలర్ ఫుల్‌గా కనిపించినా.. నాలుకకు రుచికరంగా అనిపించిన ఆహార పదార్థాలతో ఆరోగ్యం కన్నా అనర్థాలే ఎక్కువ. ఐస్‌క్రీమ్స్‌లో కలిపే కలర్స్‌లో పాయిజన్ కెమికల్స్ కలిసి ఉంటాయి. శరీరానికి హాని చేస్తాయి. వాంతులు, విరేచనాలతో పాటు గ్యాస్ట్రిక్ సంబంధ సమస్యలు తలెత్తుతాయి. నరాలు బలహీనపడి చచ్చుబడిపోతాయి. కొంత మంది ఏకంగా చాక్లెట్లలో మత్తుపదార్థాలు కలుపుతున్నారు. వీటికి అలవాటు పడిన వారు న్యూరో సంబంధ సమస్యలకు గురవుతున్నారు.

– డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, డీఎంహెచ్‌ఓ



పూజా కార్యక్రమాల్లో మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ తదితరులు

తెలంగాణ వచ్చాకే పండుగలకు ప్రాధాన్యత

- మంత్రి శ్రీనివాస్‌గౌడ్

షాద్‌నగర్: ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాకే పండుగలకు ప్రాధాన్యత పెరిగిందని మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌తో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో దేవాలయాలు అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని, పండుగలను ఆనందోత్సాహాలతో జరుపుకొంటున్నారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని అలవర్చుకోవాలని, ఆధ్యాత్మిక చింతనతో మనస్సు ప్రశాంతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్పొరేట్ శక్తుల చేతుల్లో దేశసంపద



పాదయాత్రలో సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్‌పాషా తదితరులు

- అప్పనంగా కట్టబెడుతున్న బీజేపీ ప్రభుత్వాన్ని సాగనంపాలి
- సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్‌పాషా

హుడాకాంప్లెక్స్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్‌పాషా ఆరోపించారు. బీజేపీ హటావో దేశ్‌కో బచావో.. ఇంటింటికీ సీపీఐ పోరుయాత్రలో భాగంగా గురువారం సరూర్‌నగర్ భగత్‌సింగ్‌నగర్‌లో ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన వెంటనే నల్లధనాన్ని వెనక్కి తెచ్చి పేదల బ్యాంకు ఖాతాల్లో జమచేస్తామన్న హామీ ఇంతవరకు అమలు కాలేదని అన్నారు. దేశ సంపదనంతా అంబానీ, అదానీలకు కట్టబెడుతున్న బీజేపీని దేశం నుంచి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. వంటగ్యాస్, నిత్యావసర ధరలు, ఇంధన ధరలు ఆకాశాన్నంటడంతో పేద, మధ్యతరగతి ప్రజల జీవనం దుర్భరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని కేసీఆర్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్ల పేరిట ప్రజలను మోసం చేస్తోందని, ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కె.చందు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మహిళా సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఫైమిదా, బాతరాజు నర్సింహ, పాపయ్య, కమలమ్మ, యాకూబ్‌పాషా, జిల్లెల కృష్ణ, సహిదాబేగం, శ్రీనివాస్, రాములు, మహబూబ్, అరుణాచారి, పద్మ, రాయుడు, అచ్చలి, కమిలి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ మోత



- ఇంటర్ సీట్లకు పెరిగిన డిమాండ్
- అడ్మిషన్లు ఫుల్ అంటూ ఫీజుల బాదుడు
- డే స్కాలర్‌కు రూ.లక్ష -1.50 లక్షలు
- గ్రేటర్‌లో ప్రైవేట్ విద్యాసంస్థల ఇష్టారాజ్యం

సాక్షి, సిటీబ్యూరో: టెన్త్ ఫలితాల వెల్లడితో కార్పొరేట్ కళాశాలల సీట్లకు డిమాండ్ పెరిగింది. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల బంగారు భవిష్యత్తు దృష్ట్యా ప్రదర్శిస్తున్న ఆసక్తి విద్యా సంస్థలకు కాసులు కురిపిస్తోంది. ఇప్పటికే అడ్మిషన్లు ఫుల్ ఒకటి, రెండు సీట్లు మాత్రమే ఉన్నాయంటూ ఇష్టానుసారం ఫీజుల మోత మోగిస్తున్నాయి. 2023–24 విద్యా సంవత్సరానికి 20 నుంచి 30 శాతం ఫీజులు పెంచేసిన విద్యా సంస్థలు తాజాగా సీట్లకు పెరిగిన డిమాండ్‌తో మరింత పెంచి ఎలాంటి తగ్గింపు లేకుండా వసూళ్లకు దిగాయి. పేరొందిన కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఇంటర్మీడియెట్ ఫస్టియర్ డే స్కాలర్‌కు కనీసం రూ. 75 వేల నుంచి రూ. 1.50 లక్షల వరకు చెబుతున్నారు. హాస్టల్ సౌకర్యమైతే దీనికి రెండింతలు అధికం. ఒకే కార్పొరేట్ విద్యా సంస్థకు చెందిన వివిధ బ్రాంచ్‌ల్లో ఫీజులు ఒక్కోలా ఉంటున్నాయి. మొన్నటి దాకా అధికారికంగా ఫీజుల స్ట్రక్చర్ ప్రదర్శించి కోర్సుల వారీగా.. ముందస్తు అడ్మిషన్‌లెత్తే డిస్కౌంట్ ఉంటుందని పేర్కొనగా, తాజాగా డిమాండ్ పెరగడంతో డిస్కౌంట్ లేకుండా పూర్తి ఫీజు అంగీకరిస్తేనే సీటు అని తెగేసి చెబుతున్నాయి. మరోవైపు సీటు రిజర్వేషన్ కోసం రూ.10,500 చెల్లించక తప్పడం లేదు.

పెను భారంగా..

ప్రైవేటు కార్పొరేట్ కాలేజీల ఫీజుల దోపిడీ తల్లిదండ్రులకు గుదిబండగా మారింది. మూడేళ్ల క్రితం కరోనా సమయం 2020–21, 2021–22 విద్యా సంవత్సరాల్లో మాత్రం పాత ఫీజులే తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అప్పట్లో చాలా వరకు విద్యా సంస్థలు దానిని అమలు చేశాయి. పైగా ఆన్‌లైన్ క్లాసులు జరగడం వల్ల మెయింటెనెన్స్ భారం తగ్గడంతో పాత ఫీజులు తీసుకున్నాయి. ఆ తర్వాత నుంచి ప్రభుత్వ ఆదేశాలు లేకపోవడంతో విద్యా సంస్థలు మళ్లీ ఫీజులు పెంచడం ప్రారంభించాయి. గత విద్యా సంవత్సరంలోనే భారీగా ఫీజులు పెంచిన యాజమాన్యాలు ఈసారి మరో 20 శాతం పెంచేశాయి.

అమలుకు నోచుకోని నివేదిక..

ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల ఫీజుల దోపిడీపై నియంత్రణ లేకుండా పోయింది. ఫీజుల నియంత్రణపై 2017 డిసెంబర్‌లో ఆచార్య తిరుపతి రావు కమిటీ ఒక నివేదిక సమర్పించింది. ఈ నివేదిక ప్రభుత్వానికి అంది ఐదేళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు ఈ కమిటీ సిఫారసులు అమలుకు నోచుకోలేక పోయాయి. మరోవైపు ఫీజుల రెగ్యులేటరీ చట్టాన్ని తీసుకురావాలని గతేడాది మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించినా ఫలితం లేకుండా పోయింది. వాస్తవంగా ఈ చట్టం తయారు చేసేందుకు మంత్రివర్గ ఉప సంఘాన్ని ప్రభుత్వం నియమించింది. తర్వాత ఈ కమిటీ ప్రభుత్వానికి నివేదిక సమర్పించి ప్రతి విద్యా సంవత్సరం పాత ఫీజులపై పది శాతం కంటే ఎక్కువ పెంచకూడదని సూచించింది. విద్యా సంస్థల్ని నియంత్రించేలా ఇతర సూచనలు చేసినా ఫలితం లేక పోయింది. దీంతో ఫీజులపై నియంత్రణ లేకపోవడంతో విద్యా సంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తెలంగాణ పోలీసింగ్‌లో విప్లవాత్మక మార్పులు

- హోంమంత్రి మహమూద్ అలీ

సైదాబాద్: తెలంగాణ పోలీసింగ్‌లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందని హోంమంత్రి మహమూద్ అలీ పేర్కొన్నారు. దేశంలోనే అత్యుత్తమ పోలీసింగ్ సేవలను అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. గురువారం సైదాబాద్‌లో రూ.4.25 కోట్ల వ్యయంతో నిర్మించిన నూతన పోలీస్‌స్టేషన్ భవనాన్ని డీజీపీ అంజనీకుమార్, సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం హోంమంత్రి, ఉన్నతాధికారుల సమక్షంలో సైదాబాద్ ఎస్‌హెచ్‌ఓగా సుబ్బిరామిరెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మహమూద్ అలీ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పోలీస్‌స్టేషన్లను ప్రభుత్వం కార్పొరేట్ ఆఫీస్‌లకు దీటుగా తీర్చిదిద్దుతోందన్నారు. 64 శాతం సీసీ కెమెరాల ఏర్పాటుతో దేశంలోనే ఇతర రాష్ట్రాల కంటే అగ్రస్థానంలో ఉందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వాణీదేవి, మలక్‌పేట ఎమ్మెల్యే బలాల, సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ రూపేష్, మలక్‌పేట ఏసీపీ శ్యాంసుందర్, అడిషనల్ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్, ఎస్‌ఐలు హరికృష్ణారెడ్డి, రవికుమార్, శివకుమారి, మమత, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

కష్టానికి గుర్తింపు

- పారిశుద్ధ్య కార్మికులకు వేతనాల పెంపు
- వచ్చేనెల నుంచే అమలులోకి..
- జిల్లావ్యాప్తంగా 1,668 మందికి లబ్ధి



షాబాద్‌లో ట్రాక్టర్ ద్వారా చెత్తను తరలిస్తున్న పారిశుద్ధ్య కార్మికుడు

షాబాద్: పారిశుద్ధ్య కార్మికులకు నెలకు రూ.1000 వేతనం పెంచుతూ సీఎం కేసీఆర్ ప్రకటించిన నేపథ్యంలో జిల్లాలో 1,668 కార్మికులకు లబ్ధి చేకూరనుంది. జిల్లాలో 558 గ్రామ పంచాయతీలుండగా, 1,668 మంది పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తున్నారు. వీరికి ప్రస్తుతం ఇచ్చే వేతనం నెలకు రూ.8,500 కాగా, ప్రభుత్వ ప్రకటనతో జూన్ నుంచి రూ.9,500 రానుంది.

- 2019 జనాభా ప్రాతిపదికన పారిశుద్ధ్య కార్మికులను గ్రామాల్లో నియమించారు. 500 జనాభాకు ఒక కార్మికుడి చొప్పున తీసుకున్నారు. ఇందులో భాగంగా ఐదు వందల జానాభా దాటితే ఇద్దరిని నియమించారు. అంటే 550 మంది జనాభా ఉన్నా ఇద్దరు కార్మికులకు అవకాశం లభించింది.
- రెండోసారి బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక ప్రతి పంచాయతీకి ట్రాక్టర్, ట్రాలీ, నీటిట్యాంకర్ అందుటులోకి తెచ్చారు. పారిశుద్ధ్య కార్మికులు ప్రతిరోజు చెత్తసేరకణతో పాటు నీటిసరఫరా, గ్రామంలో విద్యుత్ దీపాల ఆపరేటింగ్, పన్నుల వసూలు, పల్లెప్రకృతి వనాల్లో మొక్కలకు నీరు పెట్టడం, పల్లెప్రగతి వనాల్లో చెట్లకు నీరు పెట్టడం, పల్లెప్రగతిలో భాగంగా పలు కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంటుంది.

పల్లెలు పరిశుభ్రంగా..

ప్రతి రోజూ తడి, పొడి చెత్త సేకరణతో పల్లెలన్నీ పరిశుభ్రంగా మారుతున్నాయి. సేకరించిన చెత్తను వర్మీ కంపోస్టుగా తయారు చేసి పల్లెప్రకృతి వనాల్లో వినియోగిస్తున్నారు. దీంతో పారిశుద్ధ్య సమస్యలు తొలగిపోయి, గ్రామాలన్నీ పచ్చదనం పరుచుకుంటున్నాయి.

వ్యాధులు దూరం..

గతంలో వర్షాకాలం వచ్చిందంటే పల్లెలన్నీ అపరిశుభ్రతకు నిలయంగా ఉండేవి. చెత్తాచెదారం తొలగింపుతో దోమల బెడద తగ్గింది. పిచ్చిమొక్కల తొలగింపు, బావిబొందలు, గుంతల పూడ్చివేతతో ఏ సమస్యా లేకుండా పోయింది. సీజనల్ వ్యాధులు సైతం తగ్గుముఖం పట్టడం విశేషం.

సంతోషంగా ఉంది



సీఎం కేసీఆర్ జీతం పెంచుతామని ప్రకటించడం సంతోషంగా ఉంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామంలో అనేక రకాల పనులు చేస్తాం. మా కష్టాన్ని గుర్తించిన ప్రభుత్వం అదనంగా మరో వెయ్యి రూపాయలు పెంచు తున్నందుకు సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటాం.

– నర్సింహులు, పారిశుద్ధ్య కార్మికుడు, తాళ్లపల్లి

జీఓ కూడా వచ్చింది

పారిశుద్ధ్య కార్మికులకు వేతనం పెంచుతూ ప్రభుత్వం జీఓను సైతం విడుదల చేసింది. పెరిగిన జీతాలు వచ్చే నెల నుంచే పారిశుద్ధ్య కార్మికులకు అందజేస్తాం.

– శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి

సాంకేతిక రంగంలో భారత్ ముందడుగు

రాయదుర్గం: సాంకేతిక రంగంలో భారతదేశం ఎంతో ప్రగతి సాధించిందని గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన చర్చా కార్యక్రమంలో వక్తలు అభిప్రాయపడ్డారు. గురువారం గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో ఆన్‌లైన్ ద్వారా 'నేషనల్ టెక్నాలజీ డే–2023' పేరిట 'ఇంటిగ్రేటెడ్ అప్రోచ్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ సస్టేనబుల్ ఫ్యూచర్' అనే అంశంపై జాతీయ స్థాయి చర్చా కార్యక్రమాన్ని 'ఎస్కీ' డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వర రావుఅధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. సాంకేతికంగా సాధించిన ప్రగతితోనే ప్రపంచంలో నేడు భారత్‌కు ఎంతో గుర్తింపు వస్తోందన్నారు. భారతదేశం, జాతీయ సాంకేతిక దినోత్సవం–2023 ప్రాముఖ్యతను కూడా వక్తలు వివరించారు. కార్యక్రమంలో టీసీఎస్, మెటావర్స్ అండ్ వెబ్3 సలహాదారు హేమంత్ జుయల్, టీసీఎస్ ఏడబ్ల్యూఎస్ డేటా ఇంటిగ్రేషన్ యూనిట్ ప్రతినిధి శ్రీనివాసరామను జమ్‌కందూరి తదితరులు పాల్గొన్నారు.

రాయితీ లేకపాయె.. సహకారం అందదాయె

- కూరగాయల సాగుకు ప్రోత్సాహం కరువు
- రైతులకు తప్పనిఅవస్థలు
- పాలకులకు పట్టని గోస


గడ్డమల్లయ్యగూడలో కర్రల పందిరిపై బీర సాగు

యాచారం: కూరగాయల సాగుకు ప్రోత్సాహం కరువైంది. స్వల్పకాల వ్యవధిలోనే పంటల దిగుబడి తీసి లాభాలు పొందవచ్చని అధికారులు చెప్పడమేకానీ ఏ మేలు చేయడం లేదని రైతులు వాపోతున్నారు. మహానగరానికి దగ్గరగా ఉన్న యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం, మాడ్గుల్ తదితర మండలాల్లో వందలాది మంది రైతులు కూరగాయలను పండిస్తున్నారు. డివిజన్‌లో దాదాపు 10 వేల ఎకరాల్లో సుమారు 5 వేల మంది రైతులు కూరగాయలను పండిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. మాదన్నపేట, సరూరునగర్, వనస్థలిపురం మార్కెట్‌లు సమీపంలోనే ఉండటంతో రైతులు కూరగాయలను తరలించి విక్రయిస్తున్నారు. ఒక్కో రైతు ప్రతి నెలా రూ. 50 వేల నుంచి రూ.లక్ష వరకు ఆదాయం పొందుతున్నారు. యాచారం మండలం మొండిగౌరెల్లి, గడ్డమల్లయ్యగూడ, చౌదర్‌పల్లి, చింతుల్ల, మంచాల మండలం ఆరుట్ల, జాపాల, మంచాల, తిప్పాయిగూడ, చిత్తాపూర్, ఇబ్రహీంపట్నం మండలం కప్పాడు, కర్ణగూడ, ఎలిమినేడు, పోచారం తదితర గ్రామాల్లోని రైతులు అత్యధికంగా కూరగాయల పంటలు పండిస్తున్నారు.

ఏటా రూ.2కోట్ల విత్తన కొనుగోళ్లు

ప్రత్యేక రాష్ట్రంలో రాయితీలపై విత్తనాలు లేవు. యంత్ర సామగ్రి లేదు. వ్యవసాయ పనిముట్లు అందుబాటులో ఉండటం లేదు. ఉమ్మడి రాష్ట్రంలోనే కరువు ప్రాంతంగా ఇబ్రహీంపట్నం డివిజన్ పేరు పొందింది. భూగర్భజలాల కొరత దృష్ట్యా రైతులు నాటి నుంచి నేటి వరకు కూరగాయల పంటల సాగు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. నాణ్యమైన విత్తనాల కొనుగోలు కోసం వేలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. యేటా దాదాపు రూ. 2 కోట్లకు పైగానే పలు రకాల విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. టమాటా, మిర్చి, వంకాయ, చిక్కుడు, బెండకాయ, దోస, దొండ, సోర, బీర తదితర కూరగాయల పంటలను పండిస్తారు. నాణ్యమైన విత్తనాలు విత్తితే పంట బాగా వచ్చి దిగుబడి కలిసొస్తుందనే నమ్మకంతో రూ.వేలల్లో ఖర్చు చేస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో మండల కేంద్రాల్లోనే రాయితీలపై విత్తనాల ప్యాకెట్లు విక్రయించే వారు.

కేవలం నారేనట..

సర్కార్ నారును మాత్రమే రాయితీపై అందజేస్తోంది. టమాటా, మిర్చి, వంకాయ పంటల నారునే రాయితీపై అందజేస్తున్నారు. నారును 20 పైసలకొక మొక్క చొప్పున ప్రతి రైతుకు కేవలం 5 ఎకరాల వరకు 50 శాతం రాయితీపై అందజేస్తున్నారు. రైతులు జీడిమెట్లల్లో ఉన్న సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలో తెచ్చుకోవాల్సి ఉంటుంది. ఖర్చులు, దూరభారమవుతుండటంతో రైతులు అంతగా ఆసక్తి చూపడంలేదు. ఉద్యాన, పట్టుపరిశ్రమల శాఖ అధికారులు మండలాల్లోనే విక్రయించేలా కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.

పెట్టుబడులే అధికం



పుదీనా పంటను సాగు చేస్తున్నాం. అర ఎకరా పొలంలో పంటను సాగు చేయడంతో వడగళ్లు కురవడంతో పంట దెబ్బతిన్నది. మరోవైపు పంటకు పురుగు, దోమ పట్టడంతో మందులు చల్లుతున్నాం. ఆదాయం కన్నా పెట్టుబడికే అధికమవుతున్నాయి. కూరగాయల విత్తనాలు రాయితీపై అందజేస్తే ఆ పంటలపై కూడా ఆసక్తి చూపుతాం.

– కె. సందీప్‌రెడ్డి, యువ రైతు, మొండిగౌరెల్లి

రాయితీలు ఇస్తలేరు



ఉమ్మడి రాష్ట్రంలో కూరగాయల విత్తనాలను 50 శాతానికి పైగా రాయితీపై అందజేసేవారు. అది కూడా మండల కేంద్రాల్లోనే దుకాణాలు ప్రారంభించి విక్రయించే వారు. కానీ ప్రస్తుతం రాయితీపై విత్తనాల జాడే లేదు. యంత్రాలు, సాగు పరికరాలు లేవు. వ్యవసాయ పంటలు సాగు చేయాలంటేనే పెట్టబడి పెద్ద భారంగా మారింది.

– కాశమల్ల రాములు, రైతు చౌదర్‌పల్లి

నారే అందిస్తున్నాం



ఉద్యాన, పట్టుపరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో రైతులకు ప్రస్తుతం మిర్చి. టమాటా, వంకాయ నార్లు మాత్రమే 50 శాతం రాయితీపై అందజేస్తున్నాం. జీడిమెట్ల సెంటర్ ఆఫ్ ఎక్సలేన్సికి వెళ్లి తెచ్చుకోవాలి. విత్తనాలు, యంత్ర సామగ్రి అందుబాటులో లేవు. రాయితీపై విత్తనాలను మండల కేంద్రాల్లో విక్రయించేలా చూడాలని కోరుతున్నారు. రైతుల డిమాండ్లను ఉన్నతాధికారులకు నివేదిక పంపాం.

– కనకలక్ష్మి, ఉద్యాన, పట్టుపరిశ్రమల శాఖ అధికారి

వృద్ధురాలి అదృశ్యం

చేవెళ్ల: వృద్ధురాలు అదృశ్యమైన ఘటన చేవెళ్లలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ హయ్యూబ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చిట్టిగిద్ద రత్నమ్మ(80)కు ఇద్దరు కూతుళ్లు. ఇద్దరి వివాహాలు కావడంతో ఇంటివద్ద వృద్ధురాలు ఒంటరిగానే ఉంటోంది. ఈనెల 10న పెద్ద కూతురు లక్ష్మి తల్లిని చూసి వెళ్లిపోయింది. కూతురు వెళ్లిన తరువాత వృద్ధురాలు ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. రాత్రి అయినా ఇంటికి రాలేదు. ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

కేసీఆర్ పాలనలోనే ప్రగతి

- ఎమ్మెల్యే అంజయ్యయాదవ్
- కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరిక

కేశంపేట: బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్రం ప్రగతి బాటలో పయనిస్తోందని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్‌కు ఎంపీటీసీ దిద్దెల కిష్టమ్మ తన అనుచరులతో కలిసి గురువారం ఎక్లాస్‌ఖాన్‌పేటలో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి అహ్వానించారు. అనంతరం అయన మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రంలో సబ్బండ వర్గాలు అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎల్గనమోని రవీందర్ యాదవ్, మండల కోఆప్షన్ సభ్యులు జమాల్‌ఖాన్, జంగయ్య, యూసుఫ్, గాలయ్య, రాములు, జంగయ్య, రాజేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా బ్రహ్మోత్సవాలు


సుదర్శనయాగం నిర్వహిస్తున్న భక్తులు


పూజల్లో టీఎస్ఎస్‌ఓ అధ్యక్షుడు, తదితరులు

తలకొండపల్లి: మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు రెండో రోజు గురువారం వైభవంగా నిర్వహించారు. వేద పండితులు నరసింహాశర్మ, మరళీధర్‌శర్మలు మంత్రోచ్చరణల మధ్య మహా సుదర్శన హోమం, దాన్యధివాసం, అభిషేకం తదితర పూజలు చేశారు. ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ వెంకటేశ్ దంపతులు సుదర్శన యాగంలో పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా టీఎస్ఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మినివాస్ హాజరై స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కళాకారులు భక్తిపాటలతో అలరించారు. 80 మంది భక్తులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తిర్మని నిర్మలాశ్రీశైలంగౌడ్, సర్పంచ్‌లు లలిత, గోపాల్‌నాయక్, రఘుపతి, జ్యోతయ్య, ఉప సర్పంచ్ అనిల్, ఎంపీటీసీల మండలాధ్యక్షుడు జోగు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లో చోరీ

శంకర్‌పల్లి: ఇంటి తాళం పగుల గొట్టి బంగారు నగలు, నగదును అపహరించుకుపోయిన ఘటన రామంతపురంలో బుధవారం చోటు చేసుకుంది. సీఐ ప్రసన్న కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామంతపురానికి చెందిన కుమార్ అనే వ్యక్తి బుధవారం ఉదయం ఇంటికి తాళం వేసి పొలానికి వెళ్లాడు. తిరిగి రాత్రి వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లో ఉన్న రెండున్నర తులాల బంగారు నగలు, నగదు, సెల్ ఫోన్‌ను అపహరించినట్లు బాధితుడు తెలిపారు. . కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆయుర్వేద వైద్యుడి అదృశ్యం


ఇస్మాయిల్ సిద్దిఖీ (ఫైల్)

పహాడీషరీఫ్: ఆయుర్వేదిక్ వైద్యుడు అదృశ్యమైన సంఘటన పహాడీ షరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కాశీ విశ్వనాథ్ తెలిపిన వివరాల ప్రకారం వాదే ముస్తఫా బస్తీకి చెందిన ఇస్మాయిల్ సిద్దిఖీ(45) ఆయుర్వేదిక్ డాక్టర్. ఈ నెల 5న ఉదయం సిటీకి వెళ్తున్నానని భార్య జీనత్ బేగానికి చెప్పి బైక్‌పై వెళ్లాడు. ఎంతకి ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు అంతటా వెతికినా ఆచూకి లభించలేదు. గురువారం భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో కానీ, 87126 62367 నంబర్‌కు సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు.

పిడుగుపాటుకు నాలుగు జీవాలు మృతి


కొందుర్గు: మృతిచెందిన గేదెల కళేబరాల వద్ద రోదిస్తున్న బాధితురాలు

కద్తాల్: మండల పరిధిలోని చరికొండ గ్రామ సమీపంలో గురువారం మధ్యాహ్నం పిడుగుపాటుకు నాలుగు జీవాలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన తాడిపర్తి యాదయ్యకు చెందిన మూడు గొర్రెలు, బల్వంత్‌రెడ్డికి చెందిన మేక మృత్యువాత పడింది. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని వారు కోరారు.

పెద్దఎల్కిచర్లలో రెండు గేదెలు..

కొందుర్గు: పిడుగుపాటుకు రెండు గేదెలు మృతిచెందిన ఘటన జిల్లేడ్ చౌదరిగూడ మండలం పెద్దఎల్కిచర్లలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బోయ శ్రీశైలం గురువారం ఉదయం గేదెలను పొలం వద్ద చెట్టుకు కట్టి ఇంటికి భోజనానికి వచ్చాడు. అదేసమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది.పిడుగుపాటుకు మృత్యువాతపడ్డాయి. గేదెల విలువ రూ. 60 వేల పైనే ఉంటుందని బాధిత రైతు వాపోయారు. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోరాడు.

దరఖాస్తుల ఆహ్వానం

బడంగ్‌పేట్: బాలాపూర్ మండలం గుర్రంగూడలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశాలకు మైనారిటీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ దిలీప్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈ నెల 12 నుంచి 20 తేదీ వరకు గురుకుల పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 83095 40774, 99665 33665 నంబర్లను సంప్రదించాలన్నారు.

రోడ్డుపై కూలిన చెట్లు


రోడ్డుపై చెట్లును తొలగిస్తున్న ప్రయాణికులు

యాచారం: నక్కర్తమేడిపల్లిలో గురువారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. అరగంట పాటు భయంకరమైన ఈదురుగాలులు వీచాయి. పలుచోట్ల చెట్లు నేలకూలాయి. రోడ్డుపై వృక్షాలు కూలిపోవడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ప్రయాణికులే చెట్లను తొలగించారు. గాలులకు మామిడి తోటల్లో మామిడి కాయలు నేల రాలాయి. పలు రేకుల ఇళ్లు దెబ్బతిన్నాయి.

లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్

- రాచకొండ పోలీసుల వినూత్న కార్యక్రమం 'మార్పు కోసం ముందడుగు'
- పాత నేరస్తులకు కొత్త జీవితం
- సత్ప్రవర్తనతో మెలిగే వారికి ఉపాధి అవకాశాలు
- నిందితుల పిల్లలకు ఉచిత విద్య సదుపాయం
- 1,300 మంది పాత నేరస్తుల ఎంపిక



సాక్షి, సిటీబ్యూరో: నేరస్తులలో పరివర్తన కోసం రాచకొండ పోలీసులు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సత్ప్రవర్తనతో మెలిగే పాత నేరస్తులకు కొత్త జీవితాన్ని అందించాలనే లక్ష్యంతో 'మార్పు కోసం ముందడుగు' కార్యక్రమాన్ని ప్రారంభించారు. అర్హతలను బట్టి ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు నేరస్తుల పిల్లలకు ఉచిత విద్యను అందించనున్నారు. ఈ మేరకు రాచకొండలోని మల్కాజ్‌గిరి, ఎల్బీనగర్, భువనగిరి మూడు జోన్లలో కలిపి 1,300 మంది పాత నేరస్తులను గుర్తించారు. గత ఐదేళ్లగా వీరి ప్రవర్తన, కుటుంబ నేపథ్యం ఇతరత్రా అంశాల ఆధారంగా వీరిని ఎంపిక చేసి కొత్త జీవితాన్ని అందించనున్నారు.


విద్య, ఉద్యోగ అవకాశాలు..

ఐదారేళ్ల క్రితం తెలిసీతెలియక, క్షణికావేశంలో నేరాలకు పాల్పడిన వారు, సత్ప్రవర్తనతో మెలిగే వారిని ఎంపిక చేసి, వారికి వ్యక్తిత్వ వికాస తరగతులను నిర్వహిస్తారు. నేరాలు చేస్తే సమాజంతో పాటు వ్యక్తిగత కుటుంబానికి ఎలాంటి నష్టాలు, ఇబ్బందులు కలుగుతాయో తెలిపి వారిలో మార్పు తీసుకొస్తారు. నేరస్తులకు ఉద్యోగ అవకాశాల కోసం లయన్స్ క్లబ్ హైదరాబాద్, గ్రీన్ ల్యాండ్స్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇస్తున్నారు. డ్రైవింగ్, మెకానిక్, ఫీల్డ్ అసిస్టెంట్లు వంటి పలు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. ఇందుకోసం పలు బహుళ జాతి కంపెనీలతో రాచకొండ పోలీసులు ఒప్పందం చేసుకున్నారు. కనీసం నెలకు రూ.12 వేల నుంచి రూ.20 వేలు గౌరవ వేతనం దక్కేలా చర్యలు తీసుకుంటున్నారు. అలాగే నేరాలు మానేసి సత్ప్రవర్తనతో జీవించే నేరస్తుల పిల్లలకు ప్రభుత్వ గురుకుల పాఠశాలు, ఇతర ప్రభుత్వ విద్యా సంస్థలలో ప్రవేశ పరీక్షలకు అవసరమైన స్టడీ మెటీరియల్స్‌ను అందించడంతో పాటు, వారికి సీట్లు ఇప్పించి ఉచిత విద్య అందిస్తారు.

నేరస్తులపై నిఘా..

మార్పు కోసం ముందడుగు కార్యక్రమానికి ఎంపిక చేసిన నేరస్తులపై కూడా పోలీసులు నిరంతరం నిఘా ఉంచుతారు. నేరస్తుల వేలి ముద్రలను పోలీసు సిస్టమ్‌లో నవీకరిస్తారు. నిందితులు, వారి కుటుంబ సభ్యుల వారి కదలికలపై నిఘా పెడతారు. నేరస్తులను జియో ట్యాగింగ్ చేయడంతో పాటు వారి ఇళ్లను గూగుల్ లొకేషన్‌లో మ్యాపింగ్ చేస్తారు. వారి మొబైల్ నంబర్లను ట్రేసింగ్ చేస్తుంటారు. ఏమాత్రం చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా వెంటనే అరెస్టు చేసి, జైలుకు పంపిస్తారు.

ఎల్లవేళలా పోలీసుల సహకారం



సీసీఎస్ పోలీసులు చేస్తున్న ఈ కార్యక్రమం ద్వారా పాత నేరస్తులు పరివర్తన చెంది నూతన జీవితాన్ని మొదలుపెట్టడానికి అవకాశం దొరుకుతుంది. సత్ప్రవర్తనతో జీవించే వారికి పోలీసు నుంచి ఎల్లవేళలా సహాయసహకారాలుంటాయి.

– డీఎస్ చౌహాన్, సీపీ, రాచకొండ

ఉచిత న్యాయ సేవలు కూడా..



పదేళ్ల వరకు ఎలాంటి నేరాలకు పాల్పడని వారి మీద క్రైమ్ షీట్లు తొలగిస్తాం. గతంలో వారిపై నమోదైన కేసుల విషయంలో అడ్వకేట్లకు భారీగా ఫీజులు చెల్లించే అవసరం లేకుండా అవసరమైన సలహాలు ఇస్తాం. ఉచిత న్యాయ సేవలను అందిస్తున్నాం.

– మధుకర్ స్వామి, డీసీపీ, క్రైమ్స్